క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకిసేవ గావించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సన్మానం



మనుబోలు : కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రతిభ కనపరుస్తున్న మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన కందల సుష్మిత, చేవూరి పావని, పృథ్వీ పూర్ణిమలను గ్రామపెద్దలు సోమవారం రాత్రి ఘనంగా సన్మానించారు. సంగమేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నూతన దంపతులైన శివపార్వతులకు ఏకాంత సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా సుష్మిత, పావని, పూర్ణిమ కూచిపూడి నృత్య ప్రదర్శనలిచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఫణీంద్ర శర్మ, సాయికుమార్‌శర్మ, గ్రామపెద్దలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

టిప్పర్ స్వాధీనం



బుచ్చిరెడ్డిపాళెం : అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సెబ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ సూర్యనారాయణ మాట్లాడుతూ సంగం మండలం పడమటిపాళెం నుంచి కోవూరుకు ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్‌లో ఇసుకను తరలిస్తుండగా, తాము బుచ్చిరెడ్డిపాళెంలోని రాఘవరెడ్డి కాలనీ వద్ద ఆపి తనిఖీలు చేశామన్నారు. 25 టన్నుల ఇసుకతో పాటు టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్ గంగపట్నం వెంకరమణయ్యపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

23న గురుకులంలో ప్రవేశ పరీక్షలు

ముత్తుకూరు : ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 23వ తేదీన ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సీహెచ్ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అదేవిధంగా జూనియర్ ఇంటర్‌కు అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 359 మంది, జూనియర్ ఇంటర్ పరీక్షకు 262 మంది హాజరు కావాల్సి ఉందని వెల్లడించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ నేడు

నెల్లూరు(లీగల్) : నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బుధవారం బహిష్కరించనున్నారని అసోసియేషన్ అధ్యక్షుడు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరెడ్డి, అన్వర్‌బాషా పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేంద్రప్రసాద్, హైకోర్టు న్యాయవాది శ్రావణ్ కుమార్‌కు సీఐడీ నోటీసులివ్వడాన్ని ఖండిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

బ్రహ్మోత్సవాలపై సమన్వయ కమిటీ సమావేశం రేపు

నెల్లూరు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై ఈ నెల 30 నుంచి నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం జరపనున్నామని ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో సమావేశాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. ఆర్డీఓ మలోల అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి అధికారులు, పాలక మండలి సభ్యులు హాజరుకావాలని కోరారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. కోవూరు సచివాలయం-2 పరిధిలోని విఘ్నేశ్వరపురం, చుండుగుంట, రామనాథపురం, తూర్పు అరుంధతీయవాడ ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రసన్న మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన మేలును ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోవూరు సచివాలయం-2 పరిధిలో ఉన్న కుటుంబాలకు రూ.30.33 కోట్ల సంక్షేమ నిధులు వారి ఖాతాలో జమ అయినట్లు వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి లబ్ధిదారుడికి న్యాయం చేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు పాలనలో పాడుబడిన పాఠశాలలు నేడు కార్పొరేట్ స్థాయికి చేరాయన్నారు. ఒకప్పుడు తాగునీరు, మరుగుదొడ్లు లేని పాఠశాలల్లో నేడు మినరల్ వాటర్, అత్యాధునిక బాత్‌రూంలు అందుబాటులో ఉన్నాయన్నారు. అదేలా ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుతున్నట్లు వెల్లడించారు. సంక్షేమ పథకాలు పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. అనంతరం పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.63 లక్షలతో నాడు-నేడు రెండో విడత కార్యక్రమంలో భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ పార్వతి, ఎంఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ విజయ, నేతలు చిరంజీవి, ప్రసాద్, అంజనరావు పాల్గొన్నారు.

బాబు, పవన్‌ను ప్రజలు నమ్మరు

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరులో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న ఇద్దరు బఫూన్లతో ప్రజలు విసిగిపోతుంటే మరో బఫూన్ లోకేశ్ పాదయాత్ర రూపంలో చిరాకు తెప్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరూ ఆశీర్వదిస్తున్నారన్నారు. మన సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు 2019లో ఓ సారి చంద్రబాబుకు బుద్ధి చెప్పారని, మరోసారి ఘోర పరాభవానికి బాబు సిద్ధపడుతున్నట్లు తెలిపారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహారావు

బుచ్చిరెడ్డిపాళెం : మనబడి నాడు-నేడు, గృహనిర్మాణాల పనులపై సంబంధిత అధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీడీఓ నరసింహారావు సూచించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నాడు-నేడు, గృహనిర్మాణాల పనులపై ఆయా శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులపై నూతన కలెక్టర్ చాలా సీరియస్‌గా ఉన్నారని, గడువులోపు పనులు పూర్తి చేసే విధంగా సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల హెచ్‌ఎంలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. అలాగే జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కూడా నత్తనడకన సాగుతోందని, త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ విషయాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. గడువులోపు పనులు పూర్తి చేయకపోతే దీర్ఘకాలిక సెలవులపై వెళ్లిపోండి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాడు-నేడు ఏఈ రవి, ఎంఈఓ దిలీప్, ఏపీఎం లలితా, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శివయ్యకు అన్నాభిషేకం



అన్నాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పొదలకూరు : పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి(శివాలయం) దేవస్థానంలో శివలింగానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా మంగళవారం మాస శివరాత్రి సందర్భంగా అన్నాభిషేకం (అన్నంతో అభిషేకం) నిర్వహించారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నాభిషేకం చేపట్టారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రధానార్చకుడు పీబీఎస్ ప్రసాద్‌స్వామి మాట్లాడుతూ అన్నసూక్త పఠనం దైవారాధనతో సమానంగా భావించాల్సిందిగా పేర్కొన్నారు. ఈ అభిషేక కార్యక్రమాల్లో అర్చకులు శివ, రమేష్, మనోహర్, కుమార్‌స్వాములు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి సాయం

కోవూరు : కోవూరులో ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం భూమి పూజ చేపట్టారు. ఇందులో భాగంగా భవన నిర్మాణానికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.1.50 లక్షలను అందచేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్ నిర్వాహకులు విద్యార్థులకు నోటుపుస్తకాలను అందించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, కార్యదర్శి చంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ చలపతిరావు, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల ఉపాధ్యక్షులు నరసింహులురెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ విజయ పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



నెల్లూరు రూరల్: భార్య కాపురానికి రాలేదనే మనస్తాపంతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చెరుకుతోట సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. కిసాన్‌నగర్‌కు చెందిన నాగార్జున (32) కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈయనకు భార్య, ఏడాదిన్నర వయస్సు కలిగిన కుమారుడు ఉన్నారు. మద్యానికి బానిసవ్వడంతో విసిగిపోయిన భార్య కిసాన్‌నగర్ సమీపంలోని తన పుట్టింటికెళ్లారు. కాపురానికి రావాలని పలుమార్లు కోరినా ఆమె నిరాకరించారు. దీంతో చెరుకుతోటలోని ఓ బార్ సమీపంలో మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలు చైన్ స్నాచింగ్

నెల్లూరు(క్రైమ్): వాటర్ బాటిల్‌ను కొనుగోలు చేసేందుకు దుకాణానికి వచ్చిన గుర్తుతెలియని దుండగుడు వృద్ధురాలి మెడలోని గొలుసును తెంపుకెళ్లిన ఘటన హరనాథపురంలో మంగళవారం పట్టపగలు చోటుచేసుకుంది. వివరాలు.. హరనాథపురంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో వృద్ధురాలు సుధారాణి తన ఇంటి వద్దే ప్రావిజన్స్ అండ్ ఫ్యాన్సీ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో గుర్తుతెలియని దుండగుడు బైక్‌పై దుకాణం వద్దకు వచ్చి వాటర్ బాటిల్ కావాలని కోరాడు. వాటర్ బాటిల్‌ను ఇస్తుండగా మెడలోని మూడున్నర సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లాడు. ఘటనపై బాలాజీనగర్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

మృతుడి వివరాలు లభ్యం

నెల్లూరు(క్రైమ్): వీఆర్ లా కళాశాల సమీపంలో రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని కలిగిరి మండలం కమ్మవారిపాళేనికి చెందిన చైతన్య (34)గా రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. కమ్మవారిపాళేనికి చెందిన చైతన్యకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబకలహాల నేపథ్యంలో ఐదేళ్లుగా భార్య దూరంగా ఉంటున్నారు. ఇటీవల తన తల్లికి బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్‌కు.. అక్కడి నుంచి జయభారత్ ఆస్పత్రికి తరలించారు. తల్లితో పాటు హాస్పిటల్లోనే ఆయన ఉంటున్నారు. ఈ క్రమంలో రైలు కిందపడి సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన కోసం కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆత్మహత్య ఘటన పత్రికల్లో ప్రచురితం కావడంతో దాని ఆధారంగా రైల్వే పోలీసులను కుటుంబసభ్యులు సంప్రదించారు.

నేడు ఇఫ్తార్ విందుకు మంత్రి కాకాణి

పొదలకూరు : ముస్లింల పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని షాదీమంజిల్‌లో నిర్వహించే ఇఫ్తార్ విందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరవుతున్నట్లు ముస్లిం మైనారిటీ నేత ఎస్‌కే అంజాద్ మంగళవారం తెలిపారు. ముందుగా షాదీమంజిల్‌లో నిర్మించిన ప్రహరీని మంత్రి ప్రారంభిస్తారన్నారు. తర్వాత ముస్లింలతో సమావేశం నిర్వహించి ఇఫ్తార్ విందులో పాల్గొంటారన్నారు.

పట్టణంలో 'గడప గడపకు..'

పట్టణంలోని శ్రీనివాసపురం వీధిలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిర్వహిస్తారని ఎంపీడీఓ నగేష్‌కుమారి మంగళవారం తెలిపారు. తర్వాత పట్టణానికి సమీపంలోని తోడేరు పంచాయతీ వీవర్స్‌కాలనీలో 'గడప గడపకు..' కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వెంకటాచలం : మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలో జరుగుతుందని ఎంపీడీఓ సుస్మిత మంగళవారం తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని తెలియజేశారు. అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు.

రేపు పొదలకూరులో..

పొదలకూరు : మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుబ్బరాయుడు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ నగేష్‌కుమారి మంగళవారం తెలిపారు. తాగునీటి సమస్యపై ప్రధానంగా చర్చిస్తామని తెలియజేశారు. సమావేశానికి సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, ఇతర అధికారులు హాజరు కావాల్సిందిగా సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నరసింహ మంగళవారం తెలిపారు. మరమ్మతుల అనంతరం సరఫరా కొనసాగుతుందని చెప్పారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పటిష్టంగా భూముల రీ సర్వే

• జేసీ కూర్మనాథ్



హద్దు రాళ్లను పరిశీలిస్తున్న జేసీ

ముత్తుకూరు : గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వే పటిష్టంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ అన్నారు. మండలంలోని వల్లూరు, మల్లూరు పంచాయతీల్లో జరుగుతున్న రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు సంబంధించి విలువైన భూములకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రీసర్వే చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. కొలతల ప్రకారం రాళ్ల నాటే కార్యక్రమం పక్కాగా నిర్వహించాలన్నారు. డీఎస్‌ఎల్‌ఓ హనుమాన్ ప్రసాద్, డీఐఓఎస్ శ్రీరామమూర్తి, తహసీల్దార్ సురేష్, డీటీ భాగ్యలక్ష్మి, మండల సర్వేయర్ కామేశ్వరరావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు తగవు



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

కోవూరు : రాజకీయ లబ్ధి కోసం టీడీపీ నేతలు చేస్తున్న అసత్య ఆరోపణలు తగవని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలబోలు సుబ్బారెడ్డి అన్నారు. పోతిరెడ్డిపాళెం గ్రామంలోని ఆయన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన టీడీపీ నేత తిరుమూరు అశోక్‌రెడ్డి ఓర్వలేక మాపై నిందలు మోపుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పోతిరెడ్డిపాళెం తిప్పను కొల్లగొట్టి జేబులు నింపుకున్న విషయం అందరికీ తెలుసన్నారు. రాజకీయ ఎదుగుదల కోసం తప్పుడు ఆరోపణల చేస్తే సహించేది లేదన్నారు. సర్పంచ్ నలబోలు వాణి మాట్లాడుతూ మా పాలనను చూసి ఓర్వలేక అర్థరహిత ఆరోపణలు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీకుమారి, ఉప సర్పంచ్ మోషే, నేతలు మల్లికార్జున, రాజ, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లుగౌడ్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



మాట్లాడుతన్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు : వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ టి.సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయాల సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని చెప్పారు. మండలంలో 994 గృహాలు పూర్తి చేయాల్సి ఉన్నందున ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక చొరవ చూపి పూర్తయ్యేలా చూడాలన్నారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, ఎంఈఓ వసంతకుమారి, ఈఓపీఆర్డీ ఈ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనేక అనర్థాలు

• సెబ్ సీఐ బాలకృష్ణ



మాట్లాడుతున్న సీఐ బాలకృష్ణ

ముత్తుకూరు : మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని సెబ్ సీఐ బాలకృష్ణ హెచ్చరించారు. మండలంలోని డమ్మాయపాళెం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే ముప్పు తప్పదన్నారు. మత్తు పదార్థాలు కలిగి ఉండడం నేరమని తెలియజేశారు. ఈ మేరకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో ఉన్నత సౌకర్యాలు



మాట్లాడుతున్న ఎంఈఓ మధుసూదన

ముత్తుకూరు : సర్కారు బడుల్లో విద్యార్థులకు అవసరమైన ఉన్నత సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని ఎంఈఓ మధుసూదన అన్నారు. ముత్తుకూరు పంచాయతీలోని బలిజపాళెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, ఉన్నత చదువుల్లో రాణించాలన్నారు. ఎంపీపీ గండవరం సుగుణ, ఎంపీడీఓ ప్రత్యూష, హెచ్‌ఎం కృష్ణకుమార్, యాజమాన్య కమిటీ చైర్మన్ ధనుంజయ, ఏఎంఓ సుధీర్‌బాబు, ఉపాధ్యాయిని పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పొదలకూరు : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని గ్యాస్ గోడౌన్, పెట్రోలు బంకుల వద్ద అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఎఫ్‌ఓ వరకుమార్ పర్యవేక్షణలో అగ్నిమాపక సిబ్బంది డెమో ద్వారా పెట్రోలు బంకులు, గ్యాస్ గోదాముల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మంటలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక ఉద్యోగులు, గ్యాస్‌గోడౌన్, పెట్రోలు బంకు సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడలా 'జగనన్నే మా భవిష్యత్తు'



ఇందుకూరుపేట : గంగపట్నంలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లతో లబ్ధిదారులు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని 13 పంచాయతీలతో పాటు బుచ్చిరెడ్డిపాళెంలోని 20 వార్డుల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' అనే కార్యక్రమాన్ని మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు, కౌన్సిలర్లు ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న వ్యత్యాసాలను వివరించడంతో పాటు ఇంటికి, సెల్‌ఫోన్‌కు జగన్ చిత్రం ఉండే స్టిక్కర్‌ను అతికించారు. అనంతరం లబ్ధిదారులు వారి ఫోన్ నుంచి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి మిస్డ్‌కాల్ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, నేతలు కత్తి మహేష్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

బసవాయపాళెంలో..

కొడవలూరు : మండలంలోని బసవాయపాళెంలో సర్పంచ్ పేల్లేటి రజని ఆధ్వర్యంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి వివరించారు. నాటి బాబు పాలనకు నేటి జగనన్న పాలనకు తేడాను వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పెల్లేటి సతీష్‌రెడ్డి, దువ్వూరు అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగపట్నంలో..

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. నేటి జగన్ ప్రభుత్వానికి, నాటి చంద్రబాబు పాలనకు మధ్య తేడాను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పంబాల జనార్ధన్‌రెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు, మారుబోయిన సంతోష్‌గౌడ్, ప్రదీప్ పాల్గొన్నారు.



కొడవలూరు : ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నేతలు



బుచ్చిరెడ్డిపాళెం : నాగమాంబపురంలో..